క్లుప్తంగా

పూల కుండీల ఏర్పాటు



మొక్కలను పరిశీలిస్తున్న కమిషనర్ సమ్మయ్య

హుజూరాబాద్: పట్టణంలోని 26వ వార్డులో సీసీరోడ్డుకు ఇరువైపులా మాజీ వార్డు కౌన్సిలర్ కేసిరెడ్డి లావణ్య నర్సింహారెడ్డి సొంతంగా పూల కుండీలు ఏర్పాటు చేశారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య వార్డును సందర్శించి మాజీ కౌన్సిలర్‌ను అభినందించారు. మున్సిపల్ మేనేజర్ భూపాల్‌రెడ్డి, సూపర్ వైజర్ ప్రతాపరాజు, శివకుమార్, నాగేశ్వర్ రావు, భిక్షపతి, సంజీవ్ రావు, కుమారస్వామి, మోహన్, తిరుపతి, అవినాష్ పాల్గొన్నారు.

యువకుల సంబరాలు



మానకొండూర్‌రూరల్: రాష్ట్రంలో అంబేడ్కర్ జయంతిన ఎస్సీ వర్గీకరణను ప్రభుత్వం అమలు చేయడంపట్ల మండలంలోని ఎస్సీ యువకులు హర్షం వ్యక్తం చేశారు. బాణాసంచా పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గసిగంటి సంపత్, కోండ్ర శంకర్, రఘు, రొడ్డ అంజయ్య, అంజయ్య, శ్రావణ్, రమేశ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న రామారావు

మానకొండూర్: మండలంలోని వన్నారంలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు సోమవారం భూమిపూజ చేశారు. జీపీఎదుట విగ్రహం ఏర్పాటుకు సీనియర్ సిటిజన్, జాతీయ నాయకుడు పొలాడి రామారావు ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత విగ్రహం ఏర్పాటు చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సభ్యులు

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట అంబేడ్కర్ చౌరస్తా వద్ద సోమవారం శ్రీలక్ష్మీనరసింహస్వామి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సత్యం రెడ్డి, సంస్థ సభ్యులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పథకాల అమలులో విఫలం

వీణవంక: సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వంవిఫలమైందని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు రాపర్తి అఖిల్‌గౌడ్ అన్నారు. మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో సోమవారం మాట్లాడారు. ఆరు గ్యారంటీలతో ప్రజలను మోసం చేసిందని, కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మేస్థితిలో లేరని ఆరోపించారు. రైతుబంధు డబ్బులు ఇప్పటి వరకు రైతులకు పూర్తి స్థాయిలో పడలేదని రైతు గోస ప్రభుత్వానికి తప్పక తగులుతుందని మండిపడ్డారు.

యువత, విద్యార్థులు శాంతిమార్గంలో పోరాడాలి

చిగురుమామిడి: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే దళితులు, అణగారిన వర్గాలపై దాడులు పెరిగిపోతున్నాయని డీవైఎఫ్‌ఐ జిల్లా ప్రధానకార్యదర్శి తిరుపతి ఆరోపించారు. సోమవారం చిగురుమామిడిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం మాట్లాడారు. విద్యార్థులు, యువత సమస్యలపై అంబేడ్కర్ చూపించిన శాంతిమార్గంలో పోరాడాలని కోరారు. మనుధర్మ శాస్త్రాన్ని తీసుకొచ్చి రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. సమావేశంలో అరుణ్, రాజేశ్, రాజు, సురేశ్ ఉన్నారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు

సైదాపూర్: మండలంలోని శివరాంపల్లిలో ఆటాషవలీ దర్గాలో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపారని గ్రామానికి చెందిన సయ్యద్ సర్దార్, సర్వర్ పాషా సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కరీంనగర్‌కు చెందిన కొందరు వ్యక్తులు తవ్వకాలు జరిపారని అనుమానితుల పేర్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఉపాధిహామీ కూలీకి గాయం

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం గ్రామంలో సోమవారం ఉపాధిహామీ కూలీ గాయపడ్డాడని స్థానికులు తెలిపారు. పనులు చేస్తుండగా గట్టుపై నుంచి ప్రమాదవశాత్తు కింద పడడంతో ముక్కు నుంచి రక్తస్రావమైంది. సహచర కూలీలు ఇంటికి తీసుకువచ్చి స్థానికంగా వైద్యం చేయించినట్లు తెలిపారు.

ఏళ్లుగా ఇక్కడ ఇంతే!

- ప్రమాదకరంగా మల్లన్నపల్లి, బేతిగల్ కల్వర్టులు
- భయభయంగా ప్రయాణం
- కలగానే కనపర్తిలో వంతెన నిర్మాణం
- ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు



శిథిలావస్థలో బేతిగల్ ఊర చెరువు వద్ద కల్వర్టు



మల్లన్నపల్లి-ఘన్ముకుల మధ్య అధ్వానంగా కల్వర్టు

వీణవంక: అధికారుల నిర్లక్ష్యమో లేక పాలకుల అలసత్వమో కల్వర్టుల సమస్య ఏళ్లుగా పరిష్కారం కావడం లేదు. ఫలితంగా ప్రయాణికులు అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని ప్రయాణం చేయాల్సి వస్తోంది. మండలంలో 26 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలోని ఘన్ముక్కుల-మల్లన్నపల్లి గ్రామాల మధ్య ఉన్న కల్వర్టు ప్రమాదకర స్థాయిలో ఉంది. రెండేళ్ల క్రితం కురిసిన వర్షాలకు దెబ్బతింది. ఎప్పుడు వర్షాలు కురిసినా ఈ కల్వర్టు వద్ద వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఈ రెండు గ్రామాల మధ్య ప్రయాణం కష్టతరంగా మారింది. ఏ చిన్న పని ఉన్న మల్లన్నపల్లి గ్రామస్తులు ఘన్ముక్కులకు వెళ్తుంటారు. ఇక్కడ వంతెన నిర్మించాలనే ప్రతిపాదన ఏళ్లుగా అలాగే ఉంది. కానీ పట్టించుకున్న నాథుడు లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. అదేవిధంగా బేతిగల్-జగ్గయ్యపల్లి గ్రామాల మధ్య ఇదే సమస్య. ఈ కల్వర్టు ఎప్పుడు కూలుతుందో తెలియని దుస్థితి. ఈ దారి మీదుగా జమ్మికుంట, కరీంనగర్‌కు వాహనాలు వెళ్తుంటాయి. వర్షాలకు గొయ్యి పడి మూడేళ్లు అవుతున్నా మరమ్మతుకు నోచుకోవడం లేదు. ఇక్కడ వంతెన నిర్మించాలని బేతిగల్ గ్రామస్తులు కోరుతున్నారు.

కనపర్తి ఇదే దుస్థితి

కనపర్తి నుంచి వీణవంకకు వెళ్లే రోడ్డు వర్షాలకు కొట్టుకుపోయింది. బేతిగల్ ఊర చెరువు మత్తడి దూకడంతో ఆ వరద దిగువకు చేరడంతో రోడ్డుకు భారీ గండి పడింది. ఇక్కడ కల్వర్టు ఇరుకుగా ఉండటంతో కల్వర్టు పక్కన గండిపడింది. ఇక్కడ వంతెన నిర్మించాలని మాజీ ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ప్రతిపాదనలు పంపినా పరిష్కారం కావడంలేదు. మూడేళ్లుగా సమస్య ప్రజలను వేధిస్తోంది. అదేవిధంగా మామిడాలపల్లి శివారు గొల్లపల్లి ప్రధాన రోడ్డు మధ్యలోని కల్వర్టు వర్షాలకు తెగిపోయింది. ఇంత వరకు నిర్మాణం చేపట్టలేదు. ఇప్పటికైనా మంత్రులు, అధికారులు, స్పందించాలని నూతనంగా కల్వర్టులు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

వంతెన నిర్మించాలి

మల్లన్నపల్లి-ఘన్ముక్కుల గ్రామాల మధ్య కల్వర్టు పూర్తిగా దెబ్బతింది. ఇటీవల తాత్కాలిక మరమ్మతు చేయించినం. కానీ మళ్లీ వర్షాలకు కొట్టుకుపోయింది. శిథిలావస్థలో ఉండటం వల్ల ఇరు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ వంతెన నిర్మించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని వంతెన నిర్మించాలి. లేకుంటే ఏ చిన్న వర్షం కురిసినా ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

– కట్కూరి మధుసూదన్‌రెడ్డి, ప్యాక్స్ డైరెక్టర్, ఘన్ముక్కుల

ఎప్పుడు కూలుతుందో తెలియదు

బేతిగల్ గ్రామ శివారులోని ఊర చెరువు కట్ట వద్ద ఉన్న కల్వర్టు పూర్తిగా శిథిలావస్థలో ఉంది. కల్వర్టు మధ్యలో గుంత పడి ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు కూలుతుందో తెలియని దుస్థితి నెలకొంది. ప్రమాదకర స్థాయిలో ఉన్నా వెళ్లాల్సి వస్తోంది. ఈ దారి మీదుగా కరీంనగర్ వరకు ప్రజలు వెళ్తుంటారు. వంతెన నిర్మించాలనే ప్రతిపాదన ఎప్పటి నుంచో ఉంది. ఇప్పటికైనా అధికారులు కలుగజేసుకొని ఇక్కడ వంతెన నిర్మించాలి.

– ప్రశాంత్, యువకుడు, బేతిగల్



సైదాపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఎప్పుడు తెరుస్తారో? ఎప్పుడు మూస్తారో తెలియడం లేదు. డాక్టర్ ఉన్నాడో లేడో కూడా ఎవరికి తెలియదు. దీంతో దీర్ఘకాలిక రోగులు వైద్యం, మందుల కోసం ఇబ్బందులు పడుతున్నారు. పర్మనెంట్ వైద్యుడు లేకపోవడంతో బోర్నపల్లి దవాఖానా డాక్టర్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

భూ భారతితో రైతులకు ప్రయోజనం



చొప్పదండి: వీడియో కాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే సత్యం



మానకొండూర్‌లో రైతులు, నాయకులు

చొప్పదండి: పెండింగ్‌లోని భూ సమస్యల పరిష్కారానికి భూ భారతితో ప్రయోజనం కలుగుతుందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. చొప్పదండిలోని రైతువేదికలో భూ భారతి పోర్టల్ ఆవిష్కరణ లైవ్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వీడియో కాన్ఫరెన్స్‌ను అధికారులతో కలిసి వీక్షించారు. కార్యక్రమంలో ఏడీఏ ప్రియదర్శిని, ఏఎంసీ చైర్మన్ కొత్తూరి మహేశ్, కొండగట్టు జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, ఏవో వంశీకృష్ణ, పద్మాకర్‌రెడ్డి, తదితరులున్నారు.

మానకొండూర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రారంభించగా మండల కేంద్రంలోని రైతు వేదికలో కాంగ్రెస్ నాయకులు, రైతులు, అధికారులు సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు, మండల అధ్యక్షుడు నందగిరి రవీంద్రాచారి, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు రామిడి తిరుమల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సంపత్‌గౌడ్, నాయకులు వరహాలచారి, మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రెడ్డి, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి

సాక్షినెట్‌వర్క్: చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్, హుస్నాబాద్ నియోజకవర్గాల్లో సోమవారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన విగ్రహం, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అక్కడక్కడ అంబేడ్కర్ విగ్రహాలకు క్షీరాభిషేకం చేశారు. జమ్మికుంట పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద కమిషనర్ ఎండీ అయాజ్ అధ్యక్షతన నిర్వహించిన జయంతి వేడుకల్లో కమిషనర్‌తో బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాజు, మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీనివాస్, పట్టణ మాజీ అధ్యక్షుడు మల్లేశ్ వాగ్వాదానికి దిగారు. మున్సిపల్ పరిధిలో మహనీయుల జయంతి, వర్ధంతిని అధికారులు ఘనంగా నిర్వహించి అన్ని పార్టీలకు సమప్రాతినిధ్యం కల్పించేవారన్నారు. కమిషనర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంబేడ్కర్ ఆశయ సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. జయంతి సందర్భంగా రక్తదాన శిబిరాలు, అన్నదానం, ర్యాలీలు నిర్వహించారు. జయంతి కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల, సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మానకొండూర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



చొప్పదండి: జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే సత్యం



హుజూరాబాద్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి...



జమ్మికుంటలో కమిషనర్ అయాజ్, తహసీల్దార్ రమేశ్, నాయకులు



హుజూరాబాద్‌లో రక్తదానం



గంగాధర: నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్



ఇల్లందకుంటలో నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు



వీణవంక: బేతిగల్‌లో అంబేడ్కర్ జయంతి



శంకరపట్నం: కేశవపట్నంలో అధికారులు, మాజీ ప్రజాప్రతినిధుల నివాళి



తిమ్మాపూర్: మహాత్మానగర్‌లో...

రథోత్సవం



గంగాధర: మండలంలోని కొట్ల నర్సింహులపల్లి గ్రామంలో లక్ష్మీనర్సింహస్వామి జాతరలో భాగంగా శనివారం ఒకే వేదికపై దేవతల కల్యాణోత్సవాలు నిర్వహించి సోమవారం రథోత్సవం వైభవంగా నిర్వహించారు. లక్ష్మీనర్సింహస్వామి, సీతారామస్వామి, వేంకటేశ్వరస్వామి విగ్రహాలను ఒకే రథంపై ఊరేగించారు. కార్యక్రమంలో మహిళల కోలాటం, భజనలు ఆకట్టుకున్నాయి.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠాపనలో భక్తులు

గన్నేరువరం: మండలంలోని మైలారం శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో నవగ్రహ దేవత విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఆలయ ప్రధాన అర్చకులు మామిడాల నాగసాయిశర్మ ఆధ్వర్యంలో సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి, గోపూజ, తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించి, దాతలను సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పర్శరాములు, కమిటీ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

సన్మానం



సంతోష్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేట శ్రీమానసాదేవి ఆలయంలో అమ్మవారికి నిత్యం సమర్పించే ఒడిబియ్యం, చీరలు తదితర వాటిపై సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన అడెపు సంతోష్‌కుమార్ రూ.7,55,000 వేలం దక్కించుకున్నాడని ఆలయ చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి తెలిపారు. అనంతరం సంతోష్‌ను శాలువాతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ డైరెక్టర్లు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

అలరించిన గ్రాడ్యుయేషన్ డే



కొత్తపల్లి: కరీంనగర్ భగత్‌నగర్‌లోని అల్ఫోర్స్ ఈ–టెక్నో స్కూల్‌లో సోమవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి ఎల్‌కేజీ విద్యార్థులకు పట్టాలు పంపిణీ చేశారు. ప్రాథమిక స్థాయి నుంచే విద్యతో పాటు ఇతర అంశాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. విద్యార్థుల నాటికలు, నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌కు తరలిన నాయకులు

హుజూరాబాద్: ఆదిలాబాద్ జిల్లాలో ప్రారంభమైన మా భూమి రథయాత్రకు హుజూరాబాద్ నుంచి సోమవారం డీఎస్పీ నాయకులు తరలివెళ్లారు. వెళ్లిన వారిలో నాయకులు మంద రాజు, దాసారపు సదానందం, చందు, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

నేడు వేలం

జమ్మికుంట: పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయం ఆవరణలో ద్విచక్రవాహనానికి మంగళవారం వేలం నిర్వహించనున్నామని ఎక్సైజ్ సీఐ మాధవి సోమవారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు ఉదయం 11గంటల వరకు హాజరై యాభైశాతం ముందస్తుగా చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్యామ్‌సుందర్‌రెడ్డి

హుజూరాబాద్: మండలంలోని జూపాక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం పీఏసీఎస్ చైర్మన్ అలుమల్ల శ్యామ్ సుందర్‌రెడ్డి ప్రారంభించారు. కొనుగోలు కేంద్రంలోనే ధాన్యం విక్రయించాలని, దళారులతో మోసపోవద్దని చైర్మన్ కోరారు. పీఏసీఎస్ పరిధిలో 4 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

చిగురుమామిడి: రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ చిగురుమామిడి అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి అన్నారు. సోమవారం చిగురుమామిడి, బొమ్మనపల్లి, ఇందుర్తి, ఓగులాపూర్, గాగిరెడ్డిపల్లి, గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలోని కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. దళారులకు తక్కువ ధరకు ధానయం విక్రయించి నష్టపోవద్దని, ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలన్నారు. కార్యక్రమాల్లో మాజీ జెడ్పీటీసీరవీందర్, డిప్యూటీ తహసీల్దార్ స్వరూపారాణి, ఏఓ రాజులునాయుడు, ఎంపీవో రాజశేఖర్ రెడ్డి, సూపరింటెండెంట్ ఖాజామొయినొద్దీన్, ఏపీఎం సంపత్, పంచాయతీ కార్యదర్శులు, వీవో అధ్యక్షురాలు ఎంద్ర మహేశ్వరీ, సీసీలు సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, గంప సంపత్‌కుమార్, నాయకులు కార్యకర్తలు, పాల్గొన్నారు.



చిగురుమామిడిలో కంది తిరుపతిరెడ్డి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా: 9951602934, 9951602933, 9951602824
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కరీంనగర్ : రాజశేఖర్ - 9618304759
చొప్పదండి : మొండయ్య - 7997958217
మానకొండూర్ : మహేశ్ - 9573106760
హుజూరాబాద్ : రాములు - 9160083195
టోల్ ఫ్రీ నం. : 1800 425 9899